క్లుప్తంగా

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం


శివాని తల్లికి ఆర్థికసాయం అందిస్తున్న ఎస్సై

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన చిప్ప కుర్తి శివాని అనే చిన్నారి వైద్య ఖర్చుల కోసం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సేకరించిన రూ.75,550 లను మంగళవారం ఎస్సై షేక్‌మస్తాన్, ముప్పిడి బాలకృష్ణ పటేల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీశ్, అసం శ్రీకాంత్, మల్యాల విజయ్, రెడ్డి చైతన్య, మేడగొని విజయ్, పోతుల కుమార్, పంజా సాయిరాం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జెడ్పీ చైర్మన్ పరామర్శ


పరామర్శిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన మాదాసు మల్లయ్య, మిడిదొడ్డి శ్రీనివాస్, ఇరుగురాల అఖిల ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను మంగళవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. కమాన్‌పూర్‌కు చెందిన చెన్నూరి పోశాలు రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడిని పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, అబ్బిడి సంతోష్‌రెడ్డి, బొల్లపెల్లి లక్ష్మయ్య తదితరులున్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి


పంట పరిశీలిస్తున్న ఏఈవో ప్రశాంత్

సుల్తానాబాద్‌రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలు అధిక దిగుబడి రావాలంటే యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఈవో ప్రశాంత్ రైతులకు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకులలో మొక్కజొన్న, వరి పంటలను మంగళవారం ఏఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలలో వివిధ రకాల తెగుళ్లు, కీటకాలకు సంబంధించిన వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగుకు, దిగుబడికి తీసుకోవల్సిన సూచనలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మాతృభాష కమ్మనైనది



ఉపాధ్యాయులకు సన్మానం

సుల్తానాబాద్: మాతృభాష కమ్మనైనదని వివేకనంద పాఠశాల డైరెక్టర్ రవీందర్ అన్నారు. మంగళవారం వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష తల్లిలాంటిదని పిల్లలు దాటిన మాత్రం భాష పై ప్రేమ తగ్గదని కొనియాడారు. తెలుగు టీచర్లు రజిత, సుధారాణి, రజని, హేమలత ,అంజలి ,శైలజ ను పాఠశాల కరస్పాండెంట్ సుజాత సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చందు, సాధన డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కిరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తీర్చేలా కేంద్ర పథకాలు

రామగుండం: కేంద్రంలోని బీజేపీ పథకాలు పేదల కష్టాలు తీర్చుతున్నాయని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య అన్నారు. మంగళవారం రాత్రి అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో శక్తి కేంద్ర ఇన్‌చార్జి బండి మహేశ్‌గౌడ్ అధ్యక్షతన ప్రజాగోస బీజేపీ భరోసా యాత్ర కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు క్యాతం వెంకటరమణ, బీజేపీ అంతర్గాం మండల అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి, బోడకుంట సుభాష్, బుసిపాక సంతోష్‌కుమార్, కొదురుపాక పవన్ తదితరులున్నారు.

ప్రయాణం.. ప్రాణసంకటం


గుంతలమయమైన పెద్దపల్లి- కాటారం రోడ్డు


అధ్వానంగా ఉన్న గోదావరిఖని రోడ్డు

- అసంపూర్తి రోడ్డు పనులతో అవస్థలు
- తొమ్మిది కిలోమీటర్ల దూరానికి గంట సమయం
- భారీ గుంతలతో నిత్యం ప్రమాదాలు
- పెద్దపల్లి-కాటారం రోడ్డుకు రూ. 55 కోట్లతో ప్రతిపాదనలు

మంథని: పెద్దపల్లి–కాటారం,మంథని–గోదావరిఖని రహదారుల్లో అసంపూర్తి పనులతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఈ రెండు ప్రధాన మార్గాలు ఎక్కువ విస్తరణ, అభివృద్ధి చేసిన అధికారులు కొంత మేర వదిలివేయడంతో వాహనదారులకు ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది.

తొమిది కిలోమీటర్ల మేర నరకం

పెద్దపల్లి–కాటారం ప్రధాన రహదారిలో మంథని మండలం ఆరెంద క్రాస్ రోడ్డు వరకు రోడ్డును విస్తరించి అభివృద్ధి చేశారు. ఐతే జిల్లా సరిహద్దుకు కేవలం తొమ్మిది కిలో మీటర్లు మాత్రం అభివృద్ధి చేయకుండా వదిలేశారు. ఆరెంద క్రాస్ రోడ్డు నుంచి అడవి సోమన్‌పల్లి వంతెన వరకు తొమ్మిది కిలో మీటర్లు. ఈ రోడ్డును గత కొన్నేళ్లుగా అభివృద్ధి చేయకపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు వెంకటాపూర్, అడవి సోమన్‌పల్లి ఇసుక క్వారీల భారీ వాహనాలతో రోడ్డు అధ్వానంగా మారింది. ఈ దారిలో 40 కిలో మీటర్లు గంటలో ప్రయాణిస్తే కేవలం తొమ్మిది కిలో మీటర్లకు గంటకంటే ఎక్కువ సమయమే పడుతుందని వాహనదారులు వాపోతున్నారు,

రూ. 55 కోట్లతో ప్రతిపాదనలు

అసంపూర్తి రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ. 55 కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రజాప్రతినిధులు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించారు. త్వరలోనే నిధులు మంజూరవుతాయనే విశ్వాసం అధికారుల్లో వ్యక్తమవుతోంది.

మల్లేపల్లి వరకు విస్తరణకు నిధులు మంజూరు

మంథని–గోదావరిఖని రోడ్డులో మండలంలోని మల్లేపల్లి వరకు తారురోడ్డు వేయకుండా వదిలేశారు. ఈ రోడ్డు సైతం అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐతే రోడ్డులో ఐదు కిలో మీటర్ల రోడ్డుకు ఇటీవల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పట్టణంలోని బొక్కలవాగు వంతెన నుంచి బస్సు డిపో వరకు నూతనంగా బీటీ వేశారు.అటు తర్వాత మిగిలిన రోడ్డును విస్తరించి పూర్తి చేయాల్సి ఉంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ త్వరగా పనులు చేపట్టి అసంపూర్తి రోడ్డును పూర్తి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

వేసవిలో పూర్తి చేస్తాం



కాటారం దారిలో అడవిసోమన్‌పల్లి వరకు తొమ్మిది కిలో మీటర్ల రోడ్డు విస్తరణ అభివృద్ధికి రూ. 55 కోట్లకు ప్రతిపాదనలు చేశాం, త్వరలో నిధులు మంజూరవుతాయిని ఆశిస్తున్నాం, గోదావరిఖని రోడ్డులో మల్లేపల్లి వరకు రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. కొంతభాగం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వేసవిలో పూర్తి చేస్తాం. అలాగే డివిజన్ పరిధిలో నిధులు మంజూరై అగ్రిమెంట్ పూర్తయిన రోడ్లను సైతం వేసవిలో పూర్తి చేయిస్తాం.

– జాఫర్,డీఈఈ, ఆర్‌అండ్‌బీ,మంథని

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రస్తుత కాలంలో ఆరోగ్యంగా ఉండాలనుకునే వారంతా తప్పనిసరిగా వ్యాయామం చేయాల్సిందేనని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో మంగళవారం రూ.13 లక్షలతో నిర్మించిన వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం కాతేజీతో పాటు ఎల్లమ్మ గుండమ్మ చెరువుకట్టపై కూడా జిమ్ ఏర్పాటు చేశామని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటిఐ ఆవరణ, బందంచెరువుకట్టపై కూడా ఓపెన్‌జిమ్ ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస రెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ఈఈ సతీశ్ పాన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దపల్లి నియోజకవర్గంలోని 146మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అందించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో రూ. 11లక్షలతో చేపట్టిన సిమెంట్‌రోడ్డు నిర్మాణపు పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన బాసంపల్లి క్రాంతికుమార్‌కు మంజూరైన చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు.


ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

ఆలయాల పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలి

సుల్తానాబాద్: ఆలయాల పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని పెద్దపల్లి శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని గుడిమిట్టపల్లి శివాలయం అభివృద్ధికి పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు రూ.80 లక్షలు ప్రకటించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నగునూరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు.అనంతరం విరాళాలు ప్రకటించిన దాతలను మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత,తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక

రామగుండం: ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి బి.కపిల్ జిల్లా స్థాయి పోటీల్లో మూడో స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి మాధవి ధృవీకరణపత్రం అందజేశారు. కాగా కపిల్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై హైస్కూల్ హెచ్‌ఎం. ఇరుగురాల ఓదెలు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పిట్టల హరిప్రసాద్, కొలిపాక సంతోష్‌కుమార్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

కాన్షీరాం విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా కూడలికి సమీపంలో ఏర్పాటు చేసిన కాన్షీరాం విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ కోరారు. మంగళవారం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి తదితరులను కలిసి విగ్రహావిష్కరణకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘ నాయకుడు శ్రీమాన్, నాయకుడు పోసాని శ్రీనివాస్‌యాదవ్, అనిల్, అశోక్, సమ్మయ్య తదితరులున్నారు.

ఊహాగానాలు నిజం చేయండి

రామగుండం: రామగుండంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి కోసం రెండేళ్ల క్రితం మున్సిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానం మేరకు ప్రతిపాదిత స్థలంలోనే ఆస్పత్రి నిర్మించేలా అధికారులు చొరవ చూపాలని 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన ఈఎస్‌ఐ డిస్పెన్సరీని కూలగొడుతుండడంతో అదే ప్రాంతంలో బహుళ అంతస్తుల ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మిస్తారనే ప్రచారం జరుగుతోందని, దానిని నిజం చేయాలని కోరారు. కొంతమంది ఆస్పత్రిని అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ఎస్సీ కాలనీలో వెలుగులు

సుల్తానాబాద్: పట్టణంలోని మెయిన్ రోడ్డు నుండి 6 7 మధ్య వార్డులో రహదారి వెంబడి 10 ఏళ్లుగా ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. రోడ్డు వెంబడి విద్యుత్ లేక చీకటిగా ఉండడంతో అధికారులకు ఎన్నోసార్లు విన్నవించారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో స్థానిక కౌన్సిలర్ ఊట్ల వర ప్రదీప్‌కు స్థానికులు తెలిపారు. వెంటనే స్పందించిన కౌన్సిలర్ అధికారులతో మాట్లాడి స్తంభాలు విద్యుత్ వైర్లు తీసుకొని వస్తే బిగిస్తానని అధికారులు హామీ ఇచ్చారు. స్థానికులు విద్యుత్ స్తంభాలు కొనుగోలు చేసి తీసుకొని రాగా, విద్యుత్ వైర్లను సామగ్రిని కౌన్సిలర్ వర ప్రదీప్ సమకూర్చడంతో అధికారులు విద్యుత్ సరఫరా చేశారు. 10 ఏళ్లుగా విద్యుత్ లేకుండా చీకటిలో ఉన్న ప్రజలు విద్యుత్ సరఫరా కావడంతో సంబరాలు చేసుకున్నారు. కౌన్సిలర్ వర ప్రదీప్, ఏఈ వెంకట్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


విద్యుత్ స్తంభాలు బిగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

క్వార్టర్లు కేటాయించాలి

గోదావరిఖని: ఖాళీ క్వార్టర్లను సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. నాయకులు వేల్పుల కుమారస్వామి పాల్గొన్నారు. అనంతరం పర్సనల్ డీజీఎంకు వినతి పత్రం అందజేశారు.

వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్లకు సర్టిఫికెట్లు

గోదావరిఖని: వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శిక్షణ పూర్తి చేసిన 192మందికి సర్టిఫికెట్లను టీటీసీలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్జీ–1 జీఎం సైదులు, హెచ్‌ఆర్‌డీ జీఎం వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికార ప్రతినిధిగా గౌస్ పాషా

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధికార ప్రతినిధిగా గౌస్ పాషాను నియమిస్తూ రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు, పట్టణ కమిటీ సభ్యులకు పాషా కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన

ఎలిగేడు: స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్–2లో భాగంగా ఎలిగేడు మండలం లాలపల్లిలో ఫీల్డ్ సర్వే చేపట్టి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ గ్రామస్తులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు, సోక్ పిట్స్, కిచెన్‌గార్డెన్‌లను సందర్శించి గ్రామం సామాజిక చిత్రం గీసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ,ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై గ్రామంలో గుర్తించిన అంశాలపై చర్చించి, శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎస్‌బీఎంలు రాఘవులు, రేణుక, ఈసీ రాజ్‌కుమార్, ఏపీవో సదానందం, టీఏ అఖిల, అధికారులు ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో పశువులకు నేటి నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి ఖాన్ తెలిపారు. 22వ తేదీన ఈసాల తక్కళ్ళపల్లి, మారేడుపల్లి, పాలకుర్తి గ్రామాల్లో, 23న కొత్తపల్లి, ముంజంపల్లి, ఉండేడ, 24న రామారావుపల్లి, కుక్కలగూడుర్, వేంనూర్, 25న కన్నాల, రాణాపూర్, 27న జయ్యారం, పుట్నూర్, 28న ఎల్కలపల్లి, గుంటూర్‌పల్లి గ్రామాల్లో నిర్వహిస్తామని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి కోరారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలో రాజీవ్ రహదారిపై కన్నాల హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా వద్ద మంగళవారం బసంత్‌నగర్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై శ్రీనివాస్ వాహనాల ధ్రువీకరణ పత్రాలు, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుడి భూములను కాపాడాలని వినతి



ఓదెల: మండల కేంద్రంలోని గుడి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని అఖిల పక్ష నాయకులు మండల తహసీల్దార్ రమేశ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. గుడిభూములు అమ్మడం, కొనడం చేయొద్దని హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ భూములను విక్రయిస్తున్నారని వారు వినతిపత్రంలో తెలిపారు. ఆలయ భూముల సర్వే నెంబర్లను బహిరంగంగా ప్రకటించాలన్నారు. మల్లన్న ఆలయం భూముల హద్దులను నిర్ణయించాలని, వాటిని అమ్మకుండా చూడాలన్నారు. గుడిభూములను అమ్మే దళారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆవుల ముక్తేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, నాయకులు గుండేటి ఐలయ్యయాదవ్, ఆళ్ల సుమన్‌రెడ్డి, చింతం కుమారస్వామి, సతీశ్, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

రామగుండం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రైల్వే ప్రయివేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ప్రతినిధులు రామగుండం రైల్వేస్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులను కొల్లగొట్టి కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. రైల్వేలో నానాటికీ వేలాది మంది పదవీ విరమణ పొందడంతో వేలాది సంఖ్యలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్టు కార్మికులను నియమిస్తుందన్నారు. ఫలితంగా కనీస వేతనం, చట్టపరమైన కార్మిక అలవెన్సులు, చాలీచాలని వేతనాలు, సకాలంలో రాని వేతనాలతో కుటుంబపోషణ భారంగా మారుతుందన్నారు. వీటన్నింటిపై రైల్వే కార్మికులతో సీఐటీయూ కార్మిక ఉద్యమాలకు శ్రీకారం చుట్టనుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, తుంగపిండి మల్లేశ్, అక్కపాక శంకర్, బొంకూరి మహేశ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న అర్జున్

సుల్తానాబాద్: పదోతరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలని ఎస్సీఈఆర్టీ రాష్ట్ర బృందం సభ్యులు అర్జున్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నతపాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలల్లో తొలిమెట్టు పథకంతో విద్యార్థుల ఉత్సాహంగా చదువుతున్నారని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను విషయాన్ని ఉపాధ్యాయులు రెండింటిని ప్రేమించగలగాలని సూచించారు కార్యక్రమంలోఎడ్యుకేషనల్ సపోర్టింగ్ టీం రాష్ట్ర బృందం సభ్యులు అర్జున్, గాజుల రవీందర్, భరత్ రెడ్డి, సురేఖ, శశికాంత్ రెడ్డి, జిల్లా మానిటరింగ్ టీం కో–ఆర్డినేటర్ డాక్టర్ పిఎం షేక్. హైస్కూల్ హెచ్‌ఎం విజయ్ రావు ఎమ్మార్పీ సదానందం, చెన్నారెడ్డి గాయత్రి ఉన్నారు.

సైన్స్‌తో విద్యార్థులకు విజ్ఞానం



సైన్స్ ప్రదర్శనపై వివరిస్తున్న ఉపాధ్యాయులు

జ్యోతినగర్: విద్యార్థులు ఇష్టపడి సైన్స్ నేర్చుకుంటే జీవితంలో ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చని ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం వాలి శ్రీధర్ అన్నారు. మంగళవారం పాఠశాల హాల్‌లో నిర్వహిస్తున్న మొబైల్ సైన్స్ భౌతిక, రసాయన, జీవశాస్త్ర, గణిత ప్రయోగాల ప్రదర్శనలో పాల్గొని మాట్లాడారు. వివిధ సబ్జెక్టులకు చెందిన రిసోర్స్ పర్సన్‌లు ప్రయోగాలను విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా వివరించినట్లు తెలిపారు. ప్రయోగాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధించడం వారికి సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించే మంచి కార్యక్రమన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ అంజన్ కుమార్, జొన్నల రవీందర్, భూం రావు, హరిప్రసాద్, మహమ్మద్ రవూఫ్, శ్రీధర్, ఉపాధ్యాయులు, సీఆర్పీ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లు 52 శాతానికి పెంచాలి


రిలేదీక్ష శిబిరంలో నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీలకు జనాభా ప్రాతిపదికన దక్కాల్సిన రిజర్వేషన్లు కల్పించి 52 శాతానికి పెంచి న్యాయం చేయాలని ఉమ్మడి కరీంనగర్ మహిళా జోనల్ కన్వీనర్ సవిత అన్నారు. పెద్దపల్లి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో 27 రోజులుగా దీక్షలు కొనసాగిస్తుండడంతో పాటు కోటి సంతకాల సేకరణ చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నామని వివరించారు. బీసీ గణన చేపట్టి, రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు శేషాద్రి, రామిల్ల శారద, రవికుమార్, రాజయ్య, సమ్మయ్య, వినీత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బట్ట సంచులు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్: ప్లాస్టిక్ రహిత సమాజం బావితరాలకు ఆరోగ్యకరమని కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చాతాళ్ల కాంతయ్య, బొద్దుల సాయినాథ్ అన్నారు.మండలంలోని పెగడపల్లి వారసంతలో మంగళవారం ప్రజలకు బట్ట సంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో పర్యావరణానికి హాని జరుగుతుందని బట్ట సంచుల పంపిణీకి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జనగామ రవి, నాయకులు బింగి రాజు, నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్: మార్చి 12న హైదరబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని ఉద్యమకారులు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఉద్యమకారులకు సంక్షేమబోర్డుతో పాటు సంక్షేమ పథకాలలో ఇరవై శాతం కేటాయించాలని, పింఛన్లతో పాటు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆత్మగౌరవ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోతు జ్యోతిరెడ్డి, మట్ట రాధ, మట్ట రాజయ్య. పంతకాని రవి, లింగస్వామి,తదితరులు పాల్గొన్నారు.

గుండారం రిజర్వాయర్ నుంచి సాగునీటి విడుదల

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్ నుంచి ఆర్‌ఎస్‌బీ కెనాల్‌కు మంగళవారం సాగునీటిని విడుదల చేశారు. ఆర్‌ఎస్‌బీ కెనాల్ కింద సాగు చేసిన పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే దశకు వచ్చాయని సాగునీరు విడుదల చేయాలని రైతులు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు దృష్టికి తీసుకెళ్లగా చైర్మన్ ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మైనార్టీ కార్పొరేషన్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

రామగుండం: మైనార్టీ కార్పొరేషన్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భూక్య యాదగిరి తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్‌లో ఒక యూనిట్ (రూ.లక్ష) కోసం 70 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇంటర్వ్యూ ఉదయం 11 గంటలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధృవీకరణపత్రాలు తీసుకు రావాలని పేర్కొన్నారు.

నేడు రావుల మల్లికార్జునస్వామి నాగవెళ్లి

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీ రావుల మల్లికార్జున స్వామి కల్యాణోత్సవంలో భాగంగా నేడు నాగవెళ్లి పట్నాలు వేసేందుకు యాదవ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నాగవెళ్లి పట్నంతో పాటు బోనాలు, శోభాయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం అగ్ని గుండాలు తొక్కే కార్యక్రమం చేపట్టనున్నారు. నాగవెళ్ల పట్నాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు.

31 నుంచి స్మార్ట్ కార్డ్ సేవలు బంద్

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల వద్ద గల టోల్‌ప్లాజా వద్ద మార్చి 31 నుంచి స్మార్ట్‌కార్డు సేవలు నిలిపివేస్తామని, స్మార్ట్‌కార్డుకు బదులు వాహనదారులు ఫాస్టాగ్ చేయించుకోవాలని టోల్‌ప్లాజా అధికారులు తెలిపారు. టోల్‌ప్లాజాకు 20కిలోమీటర్ల పరిధిలో గల వాహనదారులకే ఇది వర్తిస్తుందని, ఉచిత ఫాస్టాగ్ సేవల కోసం టోల్‌ప్లాజా కార్యాలయంలో సంప్రదించి వాహనం ఆర్‌సి, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో సమర్పించాలని సూచించారు.